క్లుప్తంగా

జగనన్న గృహసారథుల మండల ఇన్‌చార్జిలు వీరే..

సాక్షి, అమలాపురం: వైఎస్సార్ సీపీ జేసీఎస్ మండల ఇన్‌చార్జిలను నియమిస్తూ ఆ పార్టీ కేంద్ర కార్యాలయం గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు మున్సిపాలిటీ, నగర పంచాయతీ, మండలాలకు జేసీఎస్ ఇన్‌చార్జిలను నియమించారు. అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా వారి వివరాలు..

కొత్తపేట
నామాల శ్రీనివాస్ (ఆలమూరు), కప్పల శ్రీధర్ (ఆత్రేయపురం), మార్గన గంగాధరరావు (కొత్తపేట), కర్రి వెంకట గోవింద కృష్ణారెడ్డి (రావులపాలెం).

పి.గన్నవరం
పులిదిండి ప్రభాకరరావు (అయినవిల్లి), దొమ్మేటి సత్యమోహన్ (అంబాజీపేట), జక్కంపూడి శ్రీనివాస్ (మామిడికుదురు), దొమ్మేటి వెంకట దుర్గారావు (పి.గన్నవరం).

రాజోలు
చింతా రాజబాబు (మలికిపురం), సిర్రా మణికుమారి (మామిడికుదురు), బుసిమి బాబ్సన్ (రాజోలు), నల్లి మోహన్ (సఖినేటిపల్లి).

ఆలమూరులో నేడు గడప గడపకూ మన ప్రభుత్వం

ఆలమూరు: మండల కేంద్రమైన ఆలమూరులో శుక్రవారం గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం జరుగుతుందని వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ తమ్మన శ్రీనివాస్, ఎంపీడీఓ కె.జాన్‌లింకన్ గురువారం విలేకర్లకు తెలిపారు. గ్రామంలో ఐదో విడత నిర్వహించే ఈ కార్యక్రమంలో ప్రభుత్వ విప్, కొత్తపేట ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి పాల్గొంటారన్నారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరించడంతో పాటు స్థానిక సమస్యలను అక్కడికక్కడే పరిష్కరిస్తారన్నారు. అనంతరం దివ్యాంగులకు త్రిచక్ర వాహనాలు అందజేస్తారని తెలిపారు. అలాగే పెదపళ్ల, పినపళ్ల గ్రామాల్లో ఇళ్ల స్థలాల పంపిణీ జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొనాలని కోరారు. అలాగే గ్రామ సచివాలయం వద్ద వలంటీర్లకు సన్మానం జరుగుతుందన్నారు.

నాట్లు త్వరితగతిన పూర్తి చేయాలి

అంబాజీపేట: వచ్చే నెల మూడో వారానికి వరి నాట్లు పూర్తి చేసుకోవాలని రైతులకు మండల వ్యవసాయాధికారి సీహెచ్‌డీ విజయ్‌కుమార్ సూచించారు. నాట్లు త్వరితగతిన పూర్తి చేస్తే నవంబర్‌లో వచ్చే తుపాన్ల వల్ల కలిగే నష్టాన్ని అధిగమించవచ్చన్నారు. నారు తీసే వారం రోజుల ముందు 5 సెంట్ల నారుమడికి కార్బోఫ్యూరాన్ 3జీ గుళికలు వేయాలన్నారు. దీని వల్ల వరిలో మొవ్వు పురుగును నివారించవచ్చన్నారు. నాట్లు వేయడం ఆలస్యమైన రైతులు వెదజల్లడం, డ్రమ్‌సీడర్‌పై దృష్టి సారించాలన్నారు. దీని వలన తక్కువ ఖర్చుతో అధిక లాభంతో పాటు సమయం కలిసి వస్తుందని తెలిపారు.

మగటపల్లిలో గృహ సంపర్క్

మామిడికుదురు: కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులను వివరిస్తూ బీజేపీ ఆధ్వర్యాన మగటపల్లిలో గురువారం గృహ సంపర్క్ కార్యక్రమం నిర్వహించారు. ఆ పార్టీ నేతలు కేంద్ర ప్రభుత్వ పథకాలను వివరిస్తూ ప్రతి ఇంటికీ వెళ్లి కరపత్రాలు పంచారు. కార్యక్రమంలో పార్టీ నేతలు అడబాల రాంబాబు, కటికిరెడ్డి తమ్మయ్యనాయుడు, నక్కా త్రిలోచనరావు తదితరులు పాల్గొన్నారు.

'జగనన్న సురక్ష'పై వలంటీర్లకు శిక్షణ

మలికిపురం: జగనన్న సురక్ష కార్యక్రమంపై వలంటీర్లకు లక్కవరంలో గురువారం ఒక రోజు శిక్షణ నిర్వహించారు. మండల స్థాయి అధికారి రాజా, జేఏసీ మండల కన్వీనర్ చింతా రాజబాబు ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. వైఎస్సార్ సీపీ గ్రామ శాఖ అధ్యక్షుడు దొరబాబు ఆధ్వర్యాన జరిగిన ఈ సమావేశంలో వలంటీర్లు, గృహసారథులకు శిక్షణ ఇచ్చారు. గుర్రం జాషువా, బత్తుల చిన్ని, వై.రాంబాబు, ఎ.కృష్ణ, ఆర్.సూర్య తదితరులు పాల్గొన్నారు.

కుష్ఠు నిర్మూలనపై అవగాహన కల్పించాలి

ఆలమూరు: కుష్ఠురహిత సమాజం నెలకొల్పేందుకు వైద్య, ఆరోగ్య సిబ్బంది గ్రామాల్లో పర్యటించి ప్రజలకు అవగాహన కల్పించాలని చొప్పెల్ల, పెదపళ్ల పీహెచ్‌సీ వైద్యాధికారులు డి.మల్లికార్జున, పి.భవానీ శంకర్ అన్నారు. కుష్ఠు వ్యాధి నిర్మూలనపై ఆయా పీహెచ్‌సీల పరిధిలోని వివిధ గ్రామాల్లో గురువారం అవగాహన సదస్సులు నిర్వహించారు. సూపర్‌వైజర్లు పీవీ రమణారావు, ఎస్.వెంకటేశ్వరరావు, సీహెచ్ బేబీ, పి.ఉమ ఆధ్వర్యాన ఆరోగ్య, ఆశ సిబ్బంది ఇంటింటికీ వెళ్లి సర్వే చేసి, అనుమానితులకు పరీక్షలు నిర్వహించారు. అనంతరం వ్యాధిగ్రస్తులకు బహుళ ఔషధ చికిత్స కిట్లు సిద్ధం చేశారు. సీహెచ్‌ఓ పి.రాధాకృష్ణ, హెల్త్ ఎడ్యుకేటర్ ఏవీవీ రాజా అక్కుల పాల్గొన్నారు.

పాలవెల్లువతో అదనపు ఆదాయం

అయినవిల్లి: జగనన్న పాలవెల్లువతో మహిళలకు అదనపు ఆదాయం లభిస్తుందని వీరవల్లిపాలెం సర్పంచ్ సలాది బుచ్చిరాజు అన్నారు. గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద మహిళా సంఘాలు, ప్రజాప్రతినిధులతో ఈ పథకంపై గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. పాలవెల్లువ యూనిట్ల ఏర్పాటుకు మహిళా కమిటీలను నియమించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి గరిమెళ్ల రవి, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

అమ్మ ఒడి.. ఆనందాల సవ్వడి

- విద్యార్థుల చదువుకు తోడ్పాటు
- మూడు నియోజకవర్గాల్లో 64,866 మంది లబ్ధిదారులు
- రూ.84.27 కోట్ల మేర ఆర్థిక సాయం

మామిడికుదురు: ప్రతి నిరుపేద విద్యార్థీ ఉన్నత విద్యను అభ్యసించాలన్నదే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృఢ సంకల్పం. దీనిని ఆచరణలో పెట్టేందుకు విద్యారంగంలో వివిధ పథకాలను ఆయన ప్రభుత్వం అమలు చేస్తోంది. ఇందులో భాగంగా జగనన్న అమ్మ ఒడి పథకం ప్రవేశపెట్టారు. దీని ద్వారా ప్రతి విద్యార్థికీ ఏడాదికి మొదటి విడతలో రూ.15 వేలు, రెండో విడతలో రూ.14 వేలు, మూడు, నాలుగు విడతల్లో రూ.13 వేల చొప్పున ఆర్థిక సహాయం అందిస్తున్నారు. ఈవిధంగా మొత్తం నాలుగు విడతల్లో విద్యార్థుల తల్లుల ఖాతాలకు ఇప్పటి వరకూ రూ.55 వేలు జమ చేశారు. పార్వతీపురం మన్యం జిల్లా కురుపాంలో బుధవారం జరిగిన సభలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమ్మ ఒడి నాలుగో విడత సహాయాన్ని విద్యార్థుల తల్లుల ఖాతాల్లో నేరుగా జమ చేశారు. దీనిపై విద్యార్థులు, వారి తల్లులు ఎంతో సంతోషంగా ఉన్నారు.

జగనన్న అమ్మ ఒడి లబ్ధి చేకూరిందిలా..

నియోజకవర్గం	విద్యార్థులు	లబ్ధి (రూ.కోట్లలో)
పి.గన్నవరం	22,031	28.62
కొత్తపేట	25,192	31.73
రాజోలు	17,643	22.92
మొత్తం	64,866	84.27



అమలాపురంలో అమ్మ ఒడి చెక్కు అందజేస్తున్న కలెక్టర్ హిమాన్షు శుక్లా, ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు, ఎమ్మెల్సీ కుడుపూడి సూర్యనారాయణరావు

ఈ పథకాలు పేదలకు వరం



ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు పేదలకు ఎంతో అండగా నిలుస్తున్నాయి. ఏడో తరగతి చదువుతున్న మా అమ్మాయి కీర్తనకు అమ్మ ఒడి ద్వారా రూ.13 వేలు వచ్చింది. డిగ్రీ ఫైనలియర్ చదువుతున్న మా అబ్బాయికి విద్యా దీవెన వస్తోంది. వైఎస్సార్ ఆసరా ద్వారా నాకు రూ.13,784 సహాయం అందింది. ఈ సంక్షేమ పథకాలు పేదలకు వరంగా మారాయి.

– నల్లి బాలవేణి, పెదపట్నంలంక

బడుగులకు అండగా..



మా అబ్బాయి అభిషేక్ ఐటీఐ ఎలక్ట్రానిక్స్ చదువుతున్నాడు. అతనికి జగనన్న వసతి దీవెన ద్వారా రూ.3 వేల సహాయం అందుతోంది. మా అబ్బాయి ఆదర్శ్ 9వ తరగతి చదువుతున్నాడు. అతడికి అమ్మ ఒడి ద్వారా రూ.13 వేలు అందాయి. నాకు వైఎస్సార్ ఆసరా ద్వారా రూ.5,700 సహాయం అందింది. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాలు ఎంతో మంది పేదలకు అండగా నిలుస్తున్నాయి.

– నాగాబత్తుల సీతామహాలక్ష్మి, ఆదుర్రు

ఎంతో ఉపయోగం



మా అమ్మాయి రష్మిత శ్రీలక్ష్మీ ప్రసన్న మొగలికుదురు స్కూల్‌లో 7వ తరగతి చదువుతోంది. మాది నిరుపేద కుటుంబం. చేనేతపై ఆధారపడి బతుకుతున్నాం. మా అమ్మాయిని చదివించడం చాలా ఇబ్బందిగా ఉన్న తరుణంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన అమ్మ ఒడి పథకం మా కుటుంబానికి ఎంతో ఉపయోగపడింది.

– కారుపర్తి ఉమామహేశ్వరి, మొగలికుదురు

ఆసరాగా నిలిచింది



నా కొడుకు దర్శిత్ పెదపట్నంలంక ప్రాథమిక పాఠశాలలో నాలుగో తరగతి చదువుతున్నాడు. ఈ ఏడాది అమ్మ ఒడి పథకం ద్వారా మాకు రూ.13 వేల సహాయం అందింది. మూడేళ్లుగా ఈ పథకం సహాయం అందుతోంది. మాలాంటి నిరుపేదల కోసం అమ్మ ఒడి పథకం ఎంతో ఆసరాగా నిలిచింది.

– చింతా జ్యోతి, పెదపట్నంలంక

ఏకలవ్యుడిని ఆదర్శంగా తీసుకోవాలి


అంబాజీపేటలో ఏకలవ్యుని విగ్రహం వద్ద కేక్ కట్ చేస్తున్న సంఘ నాయకులు

అంబాజీపేట/పి.గన్నవరం: అస్త్రవిద్యలో లక్ష్యాన్ని సాధించిన ఏకలవ్యుడిని నేటి యువత ఆదర్శంగా తీసుకోవాలని ఎస్టీ సంఘం జిల్లా అధ్యక్షుడు మానుపాటి గోవిందు అన్నారు. స్థానిక బస్ స్టేషన్ వద్ద మండల ఏకలవ్య ఎరుకుల యువజన సంఘం ఆధ్వర్యాన ఏకలవ్య జయంతిని గురువారం రాత్రి ఘనంగా నిర్వహించారు. గోవిందు మాట్లాడుతూ, ప్రభుత్వం కల్పిస్తున్న సదుపాయాలను వినియోగించుకుని ఎరుకల యువత చదువుకుని, వృద్ధిలోకి రావాలని కోరారు. అంతకు ముందు చెడీ తాలింఖానా, అగ్గిబరాటాల విన్యాసాలతో ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఏకలవ్యుని విగ్రహం వద్ద నివాళులర్పించి కేక్ కట్ చేసి పంచారు.

- పి.గన్నవరం మూడు రోడ్ల సెంటర్‌లో ఏకలవ్య మహరాజ్ జయంతి ఘనంగా నిర్వహించారు. ఏకలవ్యుని ఫ్లెక్సీకి నాయకులు పూలమాలలు వేసి, నివాళులర్పించారు. మండల ఏకలవ్య ఎస్టీ ఎరుకల సంక్షేమ సంఘం అధ్యక్షుడు బండారి మాసేరావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నియోజకవర్గ బూత్ కమిటీల కన్వీనర్ కొండేటి వెంకటేశ్వరరావు, సర్పంచ్ బొండాడ నాగమణి, రాష్ట్ర మాలల జేఏసీ కో కన్వీనర్ కోట రామ్మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు రక్ష.. జగనన్న సురక్ష

ఎంపీ అనురాధ, ఎమ్మెల్యే చిట్టిబాబు

అంబాజీపేట: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేసిన సంక్షేమ పథకాలు, అందరికీ పూర్తిగా అందేందుకు జగనన్న సురక్ష కార్యక్రమం ప్రజలకు రక్షణగా నిలుస్తుందని అమలాపురం ఎంపీ చింతా అనురాధ, పి.గన్నవరం ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు అన్నారు. అంబాజీపేట మార్కెట్ యార్డులో గురువారం వారు విలేకర్ల సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, వివిధ కారణాల వల్ల సంక్షేమ పథకాలు పొందని వారికి జగనన్న సురక్ష కార్యక్రమంలో లబ్ధి చేకూరుతుందని చెప్పారు. దీనికోసం మండల వ్యాప్తంగా రెండు బృందాలను ఏర్పాటు చేశారన్నారు. ఎంపీడీఓ, డిప్యూటీ తహసీల్దార్, తహసీల్దార్, ఈఓ పీఆర్‌డీలతో కూడిన ఈ బృందాలు మండల వ్యాప్తంగా సదస్సులు నిర్వహించి, లబ్ధి చేకూరని వారిని గుర్తించి, సంక్షేమ పథకాలు అంజేస్తారని వివరించారు. ఇతర ప్రాంతాలకు వెళ్లడం వల్ల రేషన్ కార్డులో పేరు లేకపోవడం, ఆధార్‌లో సమస్యల వలన పింఛన్ అందకపోవడం, పొలాలకు సంబంధించి మ్యుటేషన్ తదితర 11 రకాల సేవలు వారికి అందిస్తారన్నారు. వివిధ ధ్రువపత్రాలు ఉచితంగా ఇస్తారన్నారు. సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు ప్రతి ఇంటికీ వెళ్లి ఈ కార్యక్రమం గురించి వివరిస్తారన్నారు. ఈ సమావేశంలో ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు, జెడ్పీటీసీ సభ్యురాలు బూడిద వరలక్ష్మి, రాష్ట్ర బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ పేరి శ్రీనివాస్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ నాగవరపు నాగరాజు, సొసైటీ అధ్యక్షుడు దొమ్మేటి సత్యమోహన్ తదితరులు పాల్గొన్నారు.


విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ అనురాధ, ఎమ్మెల్యే చిట్టిబాబు

జనరంజక పాలనకు మద్దతు పలకాలి

- ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు
- అప్పనరామునిలంకలో గడప గడపకూ..

సఖినేటిపల్లి: ప్రజలకు చెప్పింది చేస్తూ ప్రజారంజక పాలన అందిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి రానున్న ఎన్నికల్లో సంపూర్ణ మద్దతు పలకాలని రాజోలు ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు కోరారు. అధికారులు, వలంటీర్లు, సచివాలయ సిబ్బందితో కలిసి అప్పనరామునిలంకలో గురువారం గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఆయన నిర్వహించారు. ప్రతి ఇంటికీ వెళ్లి సీఎం జగన్ పాలనలో ఆయా కుటుంబాలకు అందించిన సంక్షేమ ఫలాలను వివరించే బ్రోచర్లు అందజేశారు. అర్హులందరికీ పథకాలు సక్రమంగా అందుతున్నాయో లేదో అడిగి తెలుసుకున్నారు. అందకపోతే అందించేందుకు అక్కడికక్కడే అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాపాక మాట్లాడుతూ, గడప గడపకూ వెళ్లి ఎన్నికల మేనిఫెస్టో చూపించి మరీ ఇచ్చిన హామీలు నెరవేర్చామని చెబుతున్న ఏకైక ప్రభుత్వం వైఎస్సార్ సీపీదేనని అన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ వీరా మల్లిబాబు, సర్పంచ్ ఇందుకూరి సుబ్బరాజు, పీఏసీఎస్ అధ్యక్షుడు దివ్వి చిట్టిబాబు, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు కుసుమ చంద్రశేఖర్, గ్రామ శాఖ అధ్యక్షుడు బర్రే రాము తదితరులు పాల్గొన్నారు.


గడప గడపకూ మన ప్రభుత్వంలో పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే రాపాక

వైఎస్సార్ సీపీలోకి పలివెల వాసులు

రావులపాలెం: కొత్తపేట మండలం పలివెల గ్రామం పెదపేటకు చెందిన పలువురు ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేశారు. గోపాలపురంలోని ఎమ్మెల్యే నివాసం వద్ద గురువారం ఈ కార్యక్రమం జరిగింది. పార్టీలోకి చేరిన నల్లా శాంతరాజు, కోరం సత్యనారాయణ, వస్కా శ్రీను, సాదే భూషణం, నల్లా బాల ఏసు, గుమ్మడి రామకృష్ణ, అనిపే సురేష్, నేతల గిరికుమార్, కోరం మణికుమార్ తదితరులకు జగ్గిరెడ్డి కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు గొల్లపల్లి స్వరూప్‌రాజ్, ఉమా కొప్పేశ్వర స్వామి దేవస్థానం చైర్మన్ భమిడిపాటి దుర్గా లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.


వైఎస్సార్ సీపీలో చేరిన వారికి కండువాలు వేసి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే జగ్గిరెడ్డి

ప్రజలకు అందుబాటులో కూరగాయల ధరలు

రావులపాలెం: ప్రజలకు కూరగాయల ధరలు అందుబాటులో ఉండే విధంగా ప్రత్యేక చర్యలు తీసుకున్నామని రైతుబజార్ ఎస్టేట్ అధికారి జి.సుబ్బారావు గురువారం తెలిపారు. స్థానిక రైతుబజార్‌లో 35 మంది రైతులు అన్ని రకాల కూరగాయలను అనుకూల ధరలకు విక్రయించేలా ఏర్పాట్లు చేశామన్నారు. ఆత్రేయపురం, రావులపాలెం, కొత్తపేట మండలాల రైతులు ఇక్కడకు కూరగాయలు తీసుకువస్తున్నారన్నారు. బయటి మార్కెట్‌తో పోల్చితే కిలోకు రూ.20 నుంచి రూ.30 వరకూ తగ్గించి రైతులు ఇక్కడ విక్రయిస్తున్నారని తెలిపారు. ప్రస్తుతం కిలో టమాటా రైతుబజార్‌లో రూ.58 ఉండగా, బయటి మార్కెట్లో రూ.120 వరకూ ఉందన్నారు. అలాగే పచ్చిమిర్చి కిలో రూ.80 ఉండగా, బయటి మార్కెట్లో రూ.120 నుంచి రూ.150 వరకూ అమ్ముతున్నారన్నారు. కిలో బెండకాయలు రూ.35, బీర రూ.38, క్యారెట్ రూ.28, బంగాళాదుంపలు రూ.22, ఉల్లిపాయలు రూ.15, వంకాయలు రూ.30, దొండకాయలు రూ.25కు, ఆకుకూరలు కట్ట రూ.7కు విక్రయిస్తున్నారని సుబ్బారావు వివరించారు.


ప్రతి ఇంటా చిరునవ్వులే సీఎం లక్ష్యం

- పి.గన్నవరం ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు
- పెదపట్నంలంకలో గడప గడపకూ..

మామిడికుదురు: ప్రతి ఇంటా చిరునవ్వులు చిందిస్తూ అందరూ సంతోషంగా ఉండాలన్నదే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమని ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు అన్నారు. గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం గురువారం పెదపట్నంలంకలో జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రతి ఇంటికీ వెళ్లారు. ప్రజలతో ఆప్యాయంగా మాట్లాడి, వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఏ ఒక్కరూ నష్టపోకుండా ప్రజలందరూ క్షేమంగా ఉండాలన్నదే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. ఒకవైపు అభివృద్ధికి, మరోవైపు సంక్షేమానికి ప్రాధాన్యం ఇస్తూ సీఎం జగన్ రాష్ట్రాన్ని ప్రగతి పథంలో నడిపిస్తున్నారని చెప్పారు. గత ఎన్నికల్లో ఇచ్చిన హామీల్లో 99 శాతం అమలు చేసిన ఘనత ఆయనకే దక్కుతుందన్నారు. ప్రజల సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తున్న జగన్‌కు ప్రజలు అండగా నిలవాలని చిట్టిబాబు కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల శాఖ అధ్యక్షుడు కొమ్ముల రాము, పార్టీ నేతలు కొమ్ముల సూరిబాబు, కొమ్ముల పెద్దకాపు, బండారు బాబులు, తోరం భాస్కర్, జక్కంపూడి వాసు, నెల్లి దుర్గాప్రసాద్, తులా గోపాలకృష్ణ, గెద్దం వెంకటేశ్వరరావు, పంచాయతీ కార్యదర్శి డి.సురేష్, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.


ప్రభుత్వ సంక్షేమ పథకాల లబ్ధిని వివరిస్తున్న ఎమ్మెల్యే చిట్టిబాబు

భక్తిశ్రద్ధలతో తొలి ఏకాదశి


ఆలమూరులో గోమాతకు పూజలు చేస్తున్న మహిళలు

కొత్తపేట/ఆలమూరు/అంబాజీపేట: తొలి ఏకాదశి పర్వదినాన్ని భక్తులు గురువారం అత్యంత భక్తిశ్రద్ధలతో జరుపుకొన్నారు. విష్ణ్వాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కొత్తపేట హరిహర దేవాలయం ప్రాంగణంలోని వేంకటేశ్వరస్వామి వారి ఆలయంలో అర్చకుడు ఖండవిల్లి పాండురంగాచార్యులు ఆధ్వర్యాన, మందపల్లి వద్ద వేంకటేశ్వరస్వామి వారి ఆలయంలో అర్చకుడు ఖండవిల్లి ఆంజనేయాచార్యులు (అంజిబాబు) ఆధ్వర్యాన స్వామివార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించి, విశేషంగా అలంకరించారు. పెద్ద సంఖ్యలో భక్తులు స్వామి వార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించి, తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

- ఆలమూరు మండలంలోని వివిధ గ్రామాల్లో తొలి ఏకాదశి సందర్భంగా భక్తులు వేకువజాము నుంచే భక్తులు పుణ్యస్నానాలు ఆచరించి, వైష్ణవాలయాలను దర్శించి, ప్రత్యేక పూజలు చేశారు. ఆయా ఆలయాల వద్ద ఏకాహాలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఆలమూరు శ్రీ శ్రీదేవి, భూదేవి సమేత జనార్దనస్వామి ఆలయంలో గోమాతకు పూజాది కార్యక్రమాలు చేశారు.
- అంబాజీపేట డైలీ మార్కెట్ వెనుక శ్రీరామ్ నగర్‌లోని శ్రీ సిద్ధి వినాయక ఆలయం వద్ద గణపతి హోమం ఘనంగా నిర్వహించారు. స్వామి వారికి ప్రత్యేక పూజలు పూజలు చేశారు. ఏకాహం జరిపించారు. కొర్లపాటివారిపాలెంలోని శ్రీ వేంకటేశ్వర ఆలయంలో స్వామి వారికి పంచామృతాభిషేకాలు, ప్రత్యేక పూజలు చేశారు.

భీమ్ ఆర్మీ చీఫ్‌పై దాడి హేయం

మామిడికుదురు: భీమ్ ఆర్మీ చీఫ్ చంద్రశేఖర్ ఆజాద్‌పై కాల్పులు జరిపిన వారిని కఠినంగా శిక్షించాలని దళిత చైతన్య వేదిక డిమాండ్ చేసింది. నగరం భారత్ నగర్‌లో గురువారం జరిగిన సమావేశానికి దళిత చైతన్య వేదిక సమన్వయకర్త బత్తుల జనార్దనరావు అధ్యక్షత వహించారు. చంద్రశేఖర్‌పై దాడికి యూపీ ప్రభుత్వమే బాధ్యత వహించాలన్నారు. వేదిక వ్యవస్థాపకుడు బత్తుల మురళీకృష్ణ, వైఎస్ ఎంపీపీ పొలమూరి శ్యామ్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

ఆరుగురు జూదరుల అరెస్టు

పి.గన్నవరం: నాగుల్లంకలో పేకాట శిబిరంపై పి.గన్నవరం ఎస్సై హరికోటి శాస్త్రి బుధవారం రాత్రి దాడి చేశారు. పేకాట ఆడుతున్న ఆరుగురిని అరెస్టు చేసి, రూ.18,970 స్వాధీనం చేసుకున్నారు.

ఆనందోత్సాహాలతో బక్రీద్ వేడుక



మామిడికుదురు మసీదులో బక్రీద్ ప్రార్థనల్లో పాల్గొన్న ముస్లింలు


కొత్తపేట కమ్మిరెడ్డిపాలెం మసీదులో ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు

మామిడికుదురు/అంబాజీపేట/కొత్తపేట/ఆత్రేయపురం: బక్రీద్ పండగను ముస్లింలు గురువారం ఆనందోత్సాహాలతో నిర్వహించారు. మామిడికుదురు సున్నీ జామియా, షియా జామియా మసీదుల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. మత ప్రబోధకులు తారిక్ అన్వర్ రజ్వీ, షబ్బర్ అలీ జైదీలు బక్రీద్ ప్రాశస్త్యాన్ని భక్తులకు వివరించారు. దయామయుడైన అల్లాహ్ సన్నిధిలో ముస్లింల ప్రవక్త ఇబ్రహీమ్ తన కుమారుడైన ఇస్మాయిల్‌ను అంకితం చేసేందుకు కళ్లకు గంతలు కట్టుకుని నివేదనకు సిద్ధపడగా.. అతని భక్తిని అల్లాహ్ మెచ్చి ఇస్మాయిల్ స్థానంలో మేకపోతును ప్రత్యక్షం చేశాడని చెప్పారు. దీనిని స్మరించుకుంటూ ఏటా బక్రీద్ పండగ నిర్వహించుకోవడం ఆనవాయితీ అన్నారు. ఈ సందర్భంగా ఒకరినొకరు ఆలింగనం చేసుకుని శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు. నగరం పెద పంజీషాతో పాటు మొగలికుదురు, పెదపట్నం, కొమరాడ, మగటపల్లి మసీదుల్లో కూడా బక్రీద్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో భక్తులకు ముతావలి కల్బే ఆబేద్ మాజింద్రాణి, కమిటీ అధ్యక్షులు మసూద్ మొహిద్దీన్, సర్కిల్ పర్వత్ ఆలీ బేగ్ ఏర్పాట్లు చేశారు.

- అంబాజీపేట పెద్దవీధిలోని అంజామనే ఇందాదుల్ ముస్లిమీన్ మసీదులో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం అంబాజీపేట సెంటర్ మీదుగా ఖబరస్థాన్‌కు చేరుకుని మృతులకు నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎండీ రఫీ, పాషా, కరీం, జాకీర్, వలీ తదితరులు పాల్గొన్నారు.
- కొత్తపేట మండలంలో ముస్లింలు తమ ఇళ్ల, మసీదుల్లో ప్రత్యేక ప్రార్థనలు జరిపారు. తమ పూర్వీకుల ఆత్మశాంతి కోసం ప్రార్థించారు. అల్లాహ్ ప్రసన్నం కోసం దైవ ప్రవక్త హజ్రత్ ఇబ్రహీం చేసిన మహోన్నత త్యాగాన్ని స్మరించుకున్నారు. కొత్తపేట కమ్మిరెడ్డిపాలెం మసీదులో ముస్లింలు పెద్ద సంఖ్యలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఎవరి స్థాయిలో వారు పేదలకు దానధర్మాలు చేశారు. కుటుంబ సభ్యులు, బంధువులతో కలిసి విందు జరుపుకొన్నారు.
- ఆత్రేయపురం మండలం ర్యాలి మసీదులో ముస్లింలు బక్రీద్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. వలియా ఆధ్వర్యాన చిన్నారులు, పెద్దలు శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు. మసీదులో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీజే రాష్ట్ర కోశాధికారి షేక్ వలియా తదితరులు పాల్గొన్నారు.


పలు ప్రాంతాల్లో నేడు విద్యుత్ నిలిపివేత



కొత్తపేట/పి.గన్నవరం/అయినవిల్లి: చెట్ల కొమ్మల తొలగింపు పనుల నిమిత్తం కొత్తపేట 33 కేవీ విద్యుత్ లైన్ పరిధిలోని బిళ్లకుర్రు, వానపల్లి, అవిడి, మోడేకుర్రు, పలివెల, గంటి, ఖండ్రిగ, వాడపాలెం, మందపల్లి, ఏనుగుల మహల్ గ్రామాలతో పాటు కొత్తపేటలోని పలు ప్రాంతాల్లో శుక్రవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకూ విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నారు. ఈపీడీసీఎల్ ఈఈ ఎం.రవికుమార్ గురువారం ఒక ప్రకటనలో ఈ విషయం తెలిపారు.

- ఇదే సమయంలో నరేంద్రపురం సబ్ స్టేషన్ పరిధిలో చెట్ల కొమ్మల తొలగింపు పనుల కోసం పి.గన్నవరం మండలం కుందాలపల్లి, పప్పులవారిపాలెం, నరేంద్రపురం, రాజులపాలెం, జి.పెదపూడి, ఊడిమూడి, బెల్లంపూడి, యర్రంశెట్టివారిపాలెం గ్రామాల్లో కూడా విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నారు.
- స్తంభాలను మార్చేందుకు అయినవిల్లి మండలం నల్లచెరువు, నేదునూరు గ్రామాల్లో ఉదయం 9.30 నుంచి సాయంత్రం 5 గంటల వరకూ విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నారు.

నైవేద్యపు బుట్ట బండి సమర్పణ


నైవేద్యపు బుట్ట బండిని ఆలయానికి అందజేస్తున్న దాతలు

అంబాజీపేట: గంగలకుర్రు అగ్రహారం గ్రామ దేవత శ్రీ రావులమ్మ తల్లికి రూ.15 వేల విలువైన నైవేద్యపు బుట్ట బండిని గంగలకుర్రుకు చెందిన చిట్టావఝుల అప్పల నరసింహశాస్త్రి, పద్మావతి దంపతులు, కుటుంబ సభ్యులు గురువారం సమర్పించారు. అనంతరం అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ దొంగ నాగేశ్వరరావు, ఆలయ ఆసాది గుమ్ములూరి సూర్యనారాయణ, వైస్ సర్పంచ్ బంధన రాంబాబు తదితరులు పాల్గొన్నారు.